
ఈనాడు
వరంగల్
అర్బన్
ఆదివారం 7 జనవరి 2018
16 పేజీలు

ఈనాడు - ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో మంచి వక్తగా మారండి!.. ప్రత్యేక శిక్షణ
16లో ..

విద్య కాషాయీకరణకు కేంద్రం కుట్రలు
వివరాలు 3లో..



అమ్మా.. బాగేనా!

తమ్ముడూ.. సమస్యలున్నాయా!

- ముందస్తు ప్రచారం మొదలుపెట్టిన ప్రజాప్రతినిధులు, నేతలు
- గ్రామాల్లో జోరుగా పర్యటనలు
- ఒక్కొక్కరూ ఒక్కో పేరుతో కార్యక్రమం రూపకల్పన

ఈనాడు, వరంగల్

పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకున్నా.. కార్యకర్తల మద్దతు మెండుగా ఉన్నా.. సీనియారిటీ ఎంతున్నా.. కాకలు తీరిన వారైనా.. ఎన్నికల్లో విజయం సాధించాలంటే మాత్రం అన్నింటి కన్నా ముఖ్యంగా కావాల్సింది ప్రజల దీవెనలే. అందుకు చాలా శ్రమించాల్సిందే. సాధారణ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా.. అప్పుడే ఓరుగల్లుకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు పల్లెబాట పడుతున్నారు... పలు రకాల పేర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తూ హడావుడి చేస్తున్నారు. జనం మధ్య గడుపుతూ.. వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. ముందస్తుగా మిగతా 2లో...


10లో...

రూ.10 నోట్లు ఎరవేసి నగదు, బంగారం బ్యాగు చోరీ


సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

సాదాసీదాగా!

- మొక్కుబడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం
- ఏడు శాఖలపైనే చర్చ
- గొర్రెల పంపిణీలో అవకతవకలపై వాగ్వాదం

ఈనాడు, వరంగల్, జిల్లా పరిషత్, న్యూస్‌టుడే

జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు పైపై సమాధానాలతో సరిపుచ్చారు. 30కి పైగా ఉన్న శాఖల్లో చర్చకు వచ్చింది కేవలం ఏడంటే ఏడే. శనివారం ఛైర్‌పర్సన్ పద్మ అధ్యక్షతన ప్రారంభమైన సమావేశానికి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ప్రత్యేకాహ్వానితులుగా హాజరై ప్రసంగించారు. ఈ నెల 1 నుంచి సాగుకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్తు అందిస్తున్న నేపథ్యంలో తొలుత ఆ శాఖపై చర్చ మొదలైంది. అనంతరం పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయశాఖలపై మాట్లాడారు. భోజన విరామం తర్వాత మరో నాలుగు శాఖలపై చర్చించి ముగించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు: ఇటీవల రైతులకు నిరంతర నాణ్యమైన విద్యుత్తును ఇస్తున్న నేపథ్యంలో తీర్మానం చేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచితంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. గతంలో విద్యుత్తు సరఫరా కోసం అన్నదాతలు సబ్‌స్టేషన్ల ముట్టడి, ఆందోళనలతో అవస్థలు పడేవారని, ఇప్పుడు ఆ బాధలు తప్పాయన్నారు. గత పాలకులు తెలంగాణ వస్తే విద్యుత్తు ఉండదని చెప్పిన మాటలు నిజం కాదని కేసీఆర్ రుజువు మిగతా 2లో...

హాజరైన ఎమ్మెల్యేలు - 3	ఎంపీలు -2	ఎమ్మెల్సీలు - 1	సభ్యులు - 46	ఎన్ని గంటలు జరిగింది - 4	చర్చించిన శాఖలు - 7

పని చేయకుంటే

తప్పుకోండి!

- గుత్తేదారులపై మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం
- గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశం

ఈనాడు డిజిటల్, మహబూబాబాద్ (న్యూస్‌టుడే, మరిపెడ)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన మిషన్‌భగీరథ పనుల్లో జరుగుతున్న ఆలస్యంపై ఇంజినీరింగ్ అధికారులపై, గుత్తేదారులపై వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం శివారు మిగతా 2లో...

అమ్మా.. బాగేనా! తమ్ముడూ.. సమస్యలున్నాయా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రసన్నం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

పల్లె ప్రగతి నిద్ర..: శాసన సభాపతి మధుసూదనాచారి 'పల్లె ప్రగతి నిద్ర' పేరిట కార్యక్రమానికి రూపకల్పన చేసి గ్రామాల్లో నిద్రిస్తున్నారు. గత నెల 27న గణపురం మండల కర్కపల్లి శివారు లక్ష్మారెడ్డి పల్లిలో రాజన్నల వాళ్లతో కలిసి పల్లె నిద్ర చేశారు. స్థానికుల కష్టాలేంటో అడుగుతున్నారు. ఇలా రెండు మూడురోజులకోసారి ఒక ఊరికి వెళ్తున్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి ఏకరవు పెడుతూ ఇంకా ఏం ఇబ్బందులున్నాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల కన్నా ముందూ ఇలాగే చేశారు.

మన ఊరుకు మన గండ్ర రమణన్న..: ఉమ్మడి రాష్ట్రంలో చీఫ్ విప్‌గా పని చేసిన కాంగ్రెస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డి 'మన ఊరుకు మన గండ్ర రమణన్న' పేరుతో భూపాలపల్లి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీస్తున్నారు. ములుగు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఇటీవల నియోజకర్గంలో పాద యాత్ర చేసి తన ఉనికి చాటుకునే ప్రయత్నం చేశారు. మంగపేట, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పల్లె ప్రగతి..: పెద్ది సుదర్శన్ రెడ్డి గత ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత సీఎం..పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఈసారి ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో గ్రామాల్లోకి వెళ్తున్నారు. 'పల్లె ప్రగతి' పేరుతో తిరుగుతున్నారు. ఉపముఖ్యమంత్రితోపాటు ఇతర నేతలను ఆహ్వానిస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

తండా బాట..: మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ప్రజల మనసులు గెలవడానికి 'తండా బాట' పేరుతో విస్తృతంగా పర్యటిస్తున్నారు. జిల్లాలో తండాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ఆ పేరుతోనే ముందుకెళ్తున్నారు. 4న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు.

రచ్చబండ..: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య ఇప్పటికే 'రచ్చబండ' పేరుతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. గత జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్రాంతి తర్వాత 'దళిత కాలనీ బాట' నిర్వహించనున్నారు.

విస్తృత పర్యటన..: పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు కొంత కాలంగా నియోజకవర్గంలోని ప్రతి చిన్న కార్యక్రమానికీ హాజరవుతున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేత జంగా రాఘవ రెడ్డి సైతం కొంత కాలంగా ప్రజలతో మమేకమవుతున్నారు.

సాదాసీదాగా!



వాగ్వాదానికి దిగుతున్న ఎంపీ సీతారాంనాయక్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వెంకటేశ్వర్లు

(మొదటిపేజీ తరువాయి)

చేశారన్నారు. కర్షకులు ఆటోమెటిక్ స్టార్టర్లు వాడుతున్నారని దీని వల్ల భూగర్భజలాలు అడుగు అంటుతాయని అన్నారు. వాటిని తొలగించి అవసరం ఉన్నప్పుడు నీటిని తీసుకునే విధంగా ఉండాలన్నారు. ఈ అంశంపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలకు ప్రకటించిన గిట్టుబాటు ధర మార్కెట్‌లో లభించని సమయంలో అదే ధరను రైతులకు చెల్లించి సర్కారే కొనుగోలు చేస్తుందని కేసీఆర్ ప్రకటించడం హర్షణీయమన్నారు.

విద్యుత్తు శాఖపై చర్చ జరుగుతున్నప్పుడు జడ్పీటీసీ సభ్యులు అనేక సమస్యలను లేవనెత్తారు. మధ్యస్తంభాలు లేక తీగలు కిందకు వేలాడుతున్నాయని, ఈ కారణంగా ఎంతో మంది మృత్యువాత పడ్డారని అన్నారు. చాలా గ్రామాల్లో ఎల్‌టీ, 32 కేవీ విద్యుత్తు లైన్లు ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా వెళ్తున్నాయని, అధికారులు సరిచేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ వదులుగా ఉన్న తీగలు మొత్తం అయిదు జిల్లాల్లో ఎన్ని ఉన్నాయో అంచనా వేసి పదిరోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని, సీఎండీ ప్రభాకర్‌రావుతో మాట్లాడి తగిన బడ్జెట్టు మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో తగినంత మంది సిబ్బంది లేక స్థానికులైన అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్‌తో పనులు చేయిస్తున్నారని, దీని వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని, పలువురు మృత్యువాత పడ్డారని, ఇలాంటివి అరికట్టాలని ఎస్ఈలను కడియం ఆదేశించారు. విద్యుత్తు శాఖలో పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. ఎంపీలు సీతారాంనాయక్, పసునూరి దయాకర్, విప్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, శంకర్‌నాయక్, ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వెంకటేశ్వర్లు , ఆత్మకూరు జడ్పీటీసీ సభ్యుడు సంజీవరెడ్డి మాట్లాడారు.

ఎంపీ.. జడ్పీటీసీ సభ్యుడి మధ్య వాగ్వాదం

పశు సంవర్ధక శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం నుంచి గొర్రెలను తీసుకొని వచ్చి లబ్ధిదారులకు ఇచ్చి.. రీసైక్లింగ్ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సభ్యులు అన్నారు. ఎంపీ సీతారాంనాయక్ లేచి అలాంటి సంఘటనలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లాలని అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వెంకటేశ్వర్లు, ఎంపీ సీతారాంనాయక్ మధ్య వాగ్వాదం జరిగింది. గొర్రెల పథకం ప్రారంభించిన తరువాత డిమాండ్ బాగా ఉందని అందుకు తగ్గట్టుగా సరఫరా లేదని ఖనాపురం ఎంపీపీ రవీందర్‌రావు చెప్పారు. గొర్రెలను తిరిగి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే క్రిమినల్ కేసులను నమోదు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మార్చి 31 వరకు అర్హులైన లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయాలని సూచించారు. అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి మాట్లాడుతూ గొర్రెల రవాణా సమయంలో బీమా చేయించాలన్నారు. రవాణా జరిగిన సమయంలో మరణిస్తే వాటికి సంబంధించిన ఫొటోలను తప్పకుండా తీయాలని సూచించారు. మత్స్య శాఖ ద్వారా వివిధ చెరువులలో విడుదల చేసిన చేప పిల్లలపై అధికారులు వివరించారు.

సబ్సిడీతో ఎరువులు

వ్యవసాయ శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ గతంలో కంటే రైతులు ఇప్పుడు సంతోషంగా ఉన్నారన్నారు. వారికి నాలుగు దశలలో రుణమాఫీ జరిగిందన్నారు. సబ్సిడీ ద్వారా రుణాలు ఇస్తున్నారన్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను సబ్సిడీపై సరఫరా చేస్తున్నారన్నారు.

నేను కూలీనే!

ఆత్మకూరు జడ్పీటీసీ సభ్యుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో రైతు సమన్వయ కమిటీల్లోని రైతులకు యూరియా, డీపీఏ అంటే తెలియదని, అందులో అన్నదాతలు లేరని ఆరోపించారు. దీనికి కడియం శ్రీహరి స్పందిస్తూ భూములు ఉన్నవారికే రైతు సమన్వయ కమిటీల్లో చోటు కల్పించామని, ఎవరైనా అనర్హులు ఉంటే తమకు చెప్పాలని అన్నారు. వ్యవసాయం చేయకపోయినా రైతులకన్నా ఎక్కువ విషయాలు తెలుసునని, తాను కూలీగా పనిచేశానని ముక్తాయించారు.

విరామం తరువాత

భోజన విరామం అయ్యాక ఉప ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబాబాద్ వెళ్లారు. జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైద్యం, విద్య, ఆర్ అండ్‌బీ శాఖలపై చర్చించారు. గ్రామాలలో వైద్యాధికారులు సరిగ్గా ఉండడం లేదని అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ అధికారులు హామీ ఇచ్చారు. విద్య, ఆర్ అండ్‌బీశాఖలపై నామమాత్ర చర్చ జరిగింది. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు పద్మ ప్రకటించారు.

● జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 17.90 కోట్ల పనులకు తీర్మానం చేసి ఆమోదించారు.

మీరు ఎవరు?

● సమావేశం జరుగుతున్న సమయంలో ఇద్దరు మహిళలు బయట నుంచి నేరుగా సమావేశ మందిరంలోకి వచ్చారు. వారిని ఉపముఖ్యమంత్రి ఎవరని ప్రశ్నించగా మహిళా సంఘాల ప్రతినిధులు అని చెప్పారు. లోపలికి ఎలా వచ్చారని ప్రశ్నించడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

● సమావేశానికి హాజరైన చల్లా ధర్మారెడ్డి ఒక్క అంశంపై కూడా మాట్లాడలేదు.

● వ్యవసాయశాఖపై జేడీఏ ఉషారాణి వేగంగా మాట్లాడుతున్న క్రమంలో కడియం జోక్యం చేసుకొని ఎవరూ తరమడం లేదని అంత తొందరెందుకని, కాస్త నిదానంగా మాట్లాడాలని పేర్కొనడంతో సమావేశ మందిరంలో నవ్వులు విరిశాయి.

కోడ్ ఉన్నప్పటికీ!

వరంగల్ మహానగర పాలకసంస్థ 44వ డివిజన్ ఎన్నికలు ఈనెల 9న జరగనున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ సమయంలో జిల్లాపరిషత్ సమావేశం నిర్వహించడం , తీర్మానాలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అయినా పట్టించుకోకుండా సమావేశం జరిపి పలు తీర్మానాలు చేశారు. దీనిపై జడ్పీ అధికారులను వివరణ కోరగా.. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకున్నామని చెప్పారు. అందుకు సంబంధించిన లేఖ చూపమని అడగ్గా మౌఖిక అనుమతి తీసుకున్నామని అన్నారు. సమావేశంపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీసింది.

పని చేయకుంటే తప్పుకోండి!

(మొదటిపేజీ తరువాయి)

ఎదళ్లగుట్ట వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా మహబూబాబాద్ సెగ్మెంట్‌లో జరుగుతున్న పనుల తీరుపై ప్రశాంత్‌రెడ్డి అడిగారు. దీనికి ఎస్ఈ రాములు మాట్లాడుతూ అబ్బాయిపాలెం నుంచి 1708 ఆవాసాలకు నీరందిస్తామన్నారు. ఈ పనులు బాగానే జరుగుతున్నాయన్నారు. బొద్దుగొండకు వెళ్లే ప్రధాన పైపులైన్ పనులను రైల్వే క్రాసింగ్ వద్ద, మున్నేరు వాగుపై చేయాల్సి ఉందన్నారు. జనవరి 31 వరకు పూర్తి చేస్తామన్నారు. సంక్రాంతికి మరిపెడ మండలంలోని రక్షిత నీటి ట్యాంకుల్లోకి నీరు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన పనుల్లో ఆలస్యం అవుతుందన్నారు. వీటిని ఏ ఏజెన్సీ చేస్తుందని వైస్ ఛైర్మన్ అడగడంతో ఎన్‌సీసీ అధికారులు లేచి తామే చేస్తున్నట్లు చెప్పారు. ఎందుకు ఆలస్యం అవుతుందని అడగడంతో పొంతనలేని సమాధానం చెప్పారు. ప్రశాంత్‌రెడ్డి వారిపై మండిపడ్డారు. పనిచేయడానికి మనుషులు సరిపోకపోతే ఎక్కువ మందిని పెట్టుకుని గడువులోపు చేయాలని అన్నారు. ఇన్‌టెక్‌వెల్‌లో పంప్‌లను త్వరగా అమర్చాలని హెచ్చరించారు. తర్వాత చలివాగు, ఎల్ఎండీ, గోదావరి సెగ్మెంట్ల వారీగా జరుగుతున్న పనుల గురించి అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ దాదాపు పనులు పూర్తికావచ్చాయన్నారు. కొన్ని మాత్రమే ఆగాయన్నారు. జనవరి 20 వరకు చేసి నీటిని పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

గడువులోగా చేస్తారా.. లేదా..

స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని మండలాలకు నీటిని సరఫరా చేసేందుకు ఎల్ఎండీ నుంచి పైపులైన్లు వేస్తున్నారని.. ఈ ప్రక్రియ ఆలస్యమవుతుందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. జాతీయ రహదారి , రివర్‌క్రాసింగ్, రైల్వేక్రాసింగ్, బండ రాళ్లతో అడ్డంకులు ఏర్పడడంతో కొన్ని చోట్ల పనులు నిలిచిపోయాయన్నారు. మరింత గడువు ఇవ్వాలని గుత్తేదారు కోరుతున్నట్లు చెప్పారు. ఆగ్రహించిన వైస్ ఛైర్మన్ సదరు గుత్తేదారుతో మాట్లాడుతూ మరింత మంది కూలీలను తీసుకొచ్చి గడువు లోపు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పలుమార్లు గడువు అడిగారన్నారు. అసలు చేయగలరా..చేయలేరా అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ జనవరి 31 వరకు చేయగలరా.. లేదా.. లేకుంటే తప్పుకోవాలని సూచించారు. చీఫ్ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ మంగపేట, మంథనిలో కొంత సమస్య ఏర్పడిందన్నారు. ఇక్కడ పనులు కాస్త ఆలస్యం కానున్నాయన్నారు. ఇవి 31 వరకు పూర్తి అవుతాయన్నారు. సమావేశంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రెడ్యానాయక్, జనగామ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అనితారామచంద్రన్, అధికారులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారితో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి, పక్కన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, జనగామ ఇన్‌ఛార్జి కలెక్టర్ అనితా రామచంద్రన్, దోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తదితరులు

విద్య కాషాయీకరణకు కేంద్రం కుట్రలు

● కేరళ మాజీ మంత్రి బినయ్ విశ్వం

● ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం



ప్రసంగిస్తున్న బినయ్ విశ్వం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే : విద్యను కాషాయీకరణ చేయడానికి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేరళ అటవీ శాఖ మాజీ మంత్రి బినయ్ విశ్వం ఉద్ఘాటించారు. ఈ కుట్రలను వామపక్ష, ప్రగతిశీల విద్యార్థి లోకం తిప్పికొట్టాలని ఉద్బోధించారు. శనివారం వరంగల్ అర్బన్ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యవర్గ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేయూ క్యాంపస్‌లోని భౌతిశాస్త్రం సెమినార్ హాల్లో జరిగిన ప్రారంభ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లాఖాద్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బినయ్ విశ్వం మోదీ తీసుకుంటున్న నిర్ణయాలపై ధ్వజమెత్తారు. విశ్వవిద్యాలయాల్లో మతోన్మాద శక్తులు చొరబడి విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, మైనార్టీ వర్గాలపైన దాడులు పెరిగాయని వివరించారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలతో విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య పేద, మధ్యతరగతి వర్గాలకు దూరమవుతుందని ఆరోపించారు. విశ్వవిద్యాలయాలకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌డీఐల పేరుతో విదేశీ విశ్వవిద్యాలయాలకు రెడ్‌కార్పెట్ వేస్తోందని అన్నారు. విశ్వవిద్యాలయాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరముందన్నారు. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని బినయ్ విశ్వం సూచించారు.


హాజరైన విద్యార్థులు

కార్పొరేట్ ఆధీనంలో 80 శాతం విద్య..

సీపీఐ రాష్ట్రనేత టి.శ్రీనివాసరావు ప్రసంగిస్తూ.. నేటికీ 80 శాతం విద్య కార్పొరేట్ శక్తుల ఆధీనంలో ఉందన్నారు. ఉపాధి అధికంగా ఉన్న కోర్సుల నిర్వహణ 90 శాతానికిపైగా ప్రైవేట్ శక్తుల చేతుల్లోనే ఉందని చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాలు ఉపాధి విద్యకు దూరమవుతున్నాయని చెప్పారు. శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన జెండా ఆవిష్కరించారు. జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు వలీఉల్లాఖాద్రీ, విశ్వజిత్‌కుమార్‌లు ప్రసంగిస్తూ.. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యారంగం సమస్యలను ఎదుర్కొంటుందని వివరించారు. విద్యారంగ సమస్యలపై చర్చించడం కోసం రెండు రోజుల సమావేశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వేణు, ఆర్.శివరామకృష్ణ, సుబ్బారావు, రంగన్న, ఉపాధ్యక్షుడు ఎన్.స్టాలిక్‌అశోక్, జాతీయ కార్యవర్గ సభ్యులు, నేతలు రహీమ్‌ఫర్వీన్, నితిన్, విక్కీమహేశ్వరీ, రంజిత్, రాజారాం, భానుప్రసాద్, జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు కె.నరేష్ ద్రావిడ్, జి.నాగార్జున, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మేదరులను ఎస్టీలో చేర్చాలి

రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఎన్జీవోస్ కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం మేదరులను ఎస్టీలో చేర్చాలని రాష్ట్ర మేదరి (మహేంద్ర) మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ బొంగుల విజయలక్ష్మి కోరారు. హన్మకొండ ఎన్జీవోస్‌కాలనీలోని ఓ ప్రైవేట్ వేడుకల మందిరంలో శనివారం తెలంగాణ రాష్ట్ర మేదరి (మహేంద్ర) మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అర్బన్ జిల్లా అధ్యక్షురాలు దీకొండ సరిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా విజయలక్ష్మి, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత ఆచార్య కాత్యాయని విద్మహే హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న మేదరి వృత్తిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలను అందించి ప్రోత్సహించాలన్నారు. సమస్యల సాధనకు మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ.. మేదరి వృత్తిపై ఆధారపడిన మహిళలందరూ ఐక్యమై సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని వృత్తి పురోభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు దీకొండ సరిత మాట్లాడుతూ.. మహిళలందరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని పురుషులతో సమానంగా అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమం చివరలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ హాజరయ్యారు. అనంతరం సంఘం బాధ్యులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా నేతలు చందా స్వరాజ్యం, చందా మంగ, రాష్ట్రంలోని ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

● ప్రభుత్వ ఫెడరేషన్ల ద్వారా ఇచ్చే రుణాలు బ్యాంకు అధికారులు పూచీకత్తు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించాలి. ● ప్రభుత్వ భూములలో వెదురును పెంచి ఉచితంగా అందజేయాలి. ● మేదరులను ఎస్టీలో చేర్చడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.


హాజరైన మహిళలు

వరంగల్ తూర్పు

కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలి

గిర్మాజీపేట: ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌స్థాయి విద్యను అందించాలని 26వ డివిజన్ కార్పొరేటర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం కృష్ణాకాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఈవో వీరభద్రనాయక్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా మార్చుదాం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: వరంగల్ నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చేందుకు ప్రజలు సహకరించాలని 8వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్ సూచించారు. ఖిలావరంగల్ కోటలో ఎస్ఆర్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు నిర్వహిస్తున్న శీతాకాల శిబిరంలో భాగంగా ఐదో రోజు శనివారం మధ్యకోట యాదవవాడ, రజకవాడల్లో మహా నగర పాలక సంస్థ చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రచారం చేపట్టారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దామోదర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం విద్యార్థులు, యువత తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం తడి, పొడిచెత్త సేకరణపై ఇంటింటా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్, ఫోన్ కాల్‌పై ఖిలావరంగల్, రంగశాయిపేట, శంభునిపేట విశ్వనాథకాలనీల్లో కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొప్పుల రవీందర్, క్యాంపు ఇన్‌ఛార్జి మంజుల, రవియాదవ్ పాల్గొన్నారు.

లేబర్‌కాలనీలో స్వచ్ఛ కళాశాల

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: స్వచ్ఛ కళాశాల కార్యక్రమంలో భాగంగా శనివారం వరంగల్ లేబర్‌కాలనీలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలగించారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కళాశాల అధికారి డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్‌బాబు, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ ఐ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రచారం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు, కార్పొరేటర్ దామోదర్

19 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఛైర్మన్, ఈవో తదితరులు

రామన్నపేట, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతంలోని రామన్నపేట బాలా నగర శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఈనెల 19 నుంచి 26 వరకు నిర్వహిస్తామని దేవస్థానం ఛైర్మన్ పరాశరం శ్రీనివాసచార్య, కార్యనిర్వాహణాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారం రోజుల పాటు జరిగే శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు నర్సింహచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీధరాచార్యులు, నందనకుమాచార్య, వెంకటాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ నూతన కమిటీ ఎన్నిక

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: టీఎన్జీవోస్ వరంగల్ యూనిట్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం కొత్త జిల్లాలకు నూతన కమిటీలు ఏర్పడ్డ విషయం తెలిసిందే. నగరంలో వరంగల్, హన్మకొండ, కాజీపేట, ఖిలావరంగల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. వరంగల్ యూనిట్ కార్యవర్గాన్ని కేఎంసీలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్, ఉపాధ్యక్షుడిగా శ్యాంప్రసాద్, కార్యదర్శిగా మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా శ్రీజ్యోతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా దేవదాస్, కోశాధికారిగా అనిత, ప్రచార కార్యదర్శిగా రమణరావు, కార్యవర్గ సభ్యులుగా రవీందర్‌రెడ్డి, శ్రీలత ఎన్నికయ్యారు. గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, రాజేందర్, రాంచందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో టీఎన్జీవోస్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు కోల రాజేశ్, రూరల్ జిల్లా అధ్యక్షుడు రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొండామురళీధర్‌రావు

ఏకశిలానగర్ (కరీమాబాద్), న్యూస్‌టుడే: నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్సీ కొండామురళీధర్‌రావు ఆవిష్కరించారని 20వ డివిజన్ శాంతినగర్‌కాలనీకి చెందిన తెరాస నాయకుడు కోడం శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌బాబు, నల్గొండ రమేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

మంత్రి హరీశ్ సభను విజయవంతం చేయాలి

కరీమాబాద్, న్యూస్‌టుడే: వరంగల్ అండర్ బ్రిడ్జి విస్తరణ శంకుస్థాపన కార్యక్రమానికి ఈనెల 13న హాజరవుతున్న మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలని 21వ డివిజన్ కార్పొరేటర్ రజిత కోరారు. శనివారం కరీమాబాద్‌లో డివిజన్ తెరాస కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి సభకు డివిజన్ నుంచి 4 వేల మంది ప్రజలు తరలిరావాలన్నారు. సమావేశంలో మధుసూదన్, కల్పన, రాజేందర్, కళావతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రజిత

రైల్వేస్టేషన్‌లో అయ్యప్పల సందడి



శబరిమలకు వెళ్తున్న అయ్యప్పస్వాములు

రైల్వేస్టేషన్ (శివనగర్), న్యూస్‌టుడే: వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లన్నీ గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు రావాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు వచ్చింది. దీంతో శబరికి బయలుదేరిన అయ్యస్వాములు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇరుముడుల ధారణ తర్వాత స్వామి సన్నిధికి చేరుకోవడానికి ఓపికతో శబరికి ప్రయాణం చేస్తున్నారు. స్టేషన్‌లో వందల సంఖ్యలో అయ్యస్వాములు రైళ్ల కొసం వేచి చూడడం కనిపించింది. విశ్రాంతి గదులు, ప్లాట్‌ఫాం మొత్తం స్వాములతో నిండిపోయాయి. ఉత్తర భారతదేశంలో దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని అధికారులు తెలిపారు.

శ్రీవైష్ణవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

శివనగర్, న్యూస్‌టుడే: శ్రీవైష్ణవ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నూతన క్యాలెండర్లను శనివారం శివనగర్‌లో శ్రీమాన్ డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు మంగశాసనాలతో ఆవిష్కరించారు. శ్రీవైష్ణవ సంఘం, శ్రీవైష్ణవ పరపతి సంఘం, శ్రీవైష్ణవ సేవా పరపతి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు వెలగలేటి సేనాచార్యులు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన రంగాచార్యులు, ఆర్థిక కార్యదర్శి డింగరి శ్రీకాంత్, పొడిచేటి శ్రీనివాసాచార్యులు, గౌరవ సలహాదారులు సముద్రాల రామనరసింహాచార్యులు, మరింగంటి శేషాచార్యులు, యాదగిరాచార్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు

టీమాస్ ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని వినతి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: తెలంగాణలో సామాజిక న్యాయం కోసం టీమాస్ చేస్తున్న ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకుడు వీ. దుర్గయ్య పిలుపునిచ్చారు. శనివారం 9వ డివిజన్ పరిధిలోని బ్యాంక్‌కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, నివాసం, ఉపాధి అందుబాటులోకి వస్తాయని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని అన్నారు. ఈనెలలో టీమాస్ చేపట్టే కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. నాగపురి వెంకటేశ్వర్లు, గిరి, ముస్తాఫా, సరోజన, ఎస్‌కే.రహ్మద్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా కరపత్రాలను పంచుతున్న ప్రతినిధులు

సాయిలుకు ఘన నివాళులు



గాంధీ విగ్రహం వద్ద సాయిలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రేటర్ ఐకాస నేతలు

జీఆర్‌గుట్ట (గిర్మాజీపేట), న్యూస్‌టుడే: ఇసుకాసురుల ధనదాహానికి బలైన సాయిలుకు శనివారం గ్రేటర్ పౌర సంఘాల ఐకాస నేతలు ఘన నివాళులర్పించారు. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద సాయిలు చిత్రపటానికి పూలమాల వేసి కాసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఐకాస కన్వీనర్ శరత్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇసుక మాఫియా చేతిలో బలైపోతున్న కుటుంబాలు ఇటీవల పెరుగుతున్నాయన్నారు. మాఫియాను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దందాను అడ్డుకోబోయిన వీఆర్‌ఏను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేసిన వ్యక్తులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాలుగౌడ్, టీమాస్ నాయకులు దుర్గయ్య, సీపీఐ నాయకులు ఎలగొండ సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు గజ్జెల లింగమూర్తి, తెదేపా నాయకులు కంద్రాతి రాజు, చెరకు నర్సింహ, చంద్రశేఖర్, చిరంజివి, శివ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ తూర్పు

శ్రీభద్రకాళిని దర్శించుకున్న భాజపా నాయకులు

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి అమ్మవారిని శనివారం రాత్రి భాజపా రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పలువురు దర్శించుకున్నారు. హన్మకొండ ప్రాంతంలోని 44వ డివిజన్లో భాజపా అభ్యర్థి సంతోష్‌రెడ్డి తరుపున ప్రచారం చేసేందుకు రాష్ట్ర నాయకులు నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రైల్వేస్టేషన్‌లో పారిశుద్ధ్య పనుల తనిఖీలు


అధికారులకు సూచనలు ఇస్తున్న సీనియర్ డీఎంఈ గుప్తా

రైల్వేస్టేషన్ (శివనగర్), న్యూస్‌టుడే: వరంగల్ రైల్వే స్టేషన్‌లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తీరుపై దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డీఎంఈ (ఈఅండ్‌హెచ్) గుప్తా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈనెల 5న 'ఈనాడు' తూర్పు నగరం పేజీలో 'రైల్వేస్టేషన్‌లో పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన ప్రచురించిన కథనంతో పాటు శనివారం రైల్వే పారిశుద్ధ్య కార్మికుల శ్రమ దోపిడీపై ఈనెల 6న 'ఈనాడు' నగర పత్రిక 16వ పేజీలో ప్రచురించిన కథనాలపై ఆయన స్పందించారు. శనివారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించి పలు చోట్ల తనిఖీలు చేశారు. స్టేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ మీనా, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఏఈఎన్ అనిల్‌కుమార్‌లతో కలిసి స్టేషన్ మొత్తం కలియతిరిగారు. స్టేషన్ ఆవరణలో చెత్త లేకుండా చూడాలని, ప్లాట్‌ఫాంపై ఎక్కడా కూడా చిన్న మరక కూడా ఉండరాదని సూచించారు. స్టేషన్‌ను శుభ్రంచేసే యంత్రాలు నెల రోజులుగా పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఎందుకు మరమ్మతులు చేయించడంలేదని ఆరా తీశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రాచేయడంపై విచారణ చేశారు. ప్లాట్‌ఫాంపై యంత్రాలు సులభంగా తిరగడానికి అనువుగా దెబ్బతిన్న బండలను తొలగించి కొత్తవాటిని వేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రైల్వే ఇంజినీరింగ్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు సూపర్‌వైజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు నృత్యకౌముది పురస్కారం


అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్

కొత్తవాడ, న్యూస్‌టుడే: తుమ్మలకుంటకు చెందిన తౌటం శ్రీనివాస్ నృత్యకౌముది అవార్డును అందుకున్నాడు. అల్లూరి కాలేజీలో ఎంబీఏ చదువుతున్న అతను పేరిణి నృత్యం విశారద పూర్తిచేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో నిర్వహించిన అభినయ నృత్యభారతి 22వ వార్షికోత్సవంలో నిర్వాహకులు అతనికి అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న అతడిని కొత్తవాడలో శనివారం నటరాజ కళా కృష్ణ నృత్యజ్యోతి అకాడమీలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షురాలు చంద్రకళ రామకృష్ణ, ప్రముఖ పేరిణి నాట్యాచారులు రంజిత్‌కుమార్, పేరిణి అధ్యాపకురాలు నవ్యజ, పేరిణి నృత్య కళాకారులు శ్రావణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు స్ఫూర్తిదాయకం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్వరాజ్‌బాబు

పోచమ్మమైదాన్, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు స్వరాజ్‌బాబు కొనియాడారు. హన్మకొండలోని అవోపా భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రు. యాదాద్రి అవోపా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. వైశ్య కిరణం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంఘటితంగా సేవా కార్యక్రమాల్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అవోపా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, చందర్, నారాయణ, డాక్టర్ రవీందర్, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, భాస్కర్‌రావు, స్థానిక అవోపా అధ్యక్షుడు రవీందర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రేణుక, తదితరులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణవేత్త ఎర్రబెల్లి రేణుక సూచించారు. శనివారం ఖిలా వరంగల్ పడమరకోట బాలాజీ హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ మనుగడ ముందుకు సాగాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, విద్యార్థి దశ నుంచే మొక్కలు పెంచాలని, కాలుష్యాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు విశ్వ మానవులంతా ఏకమవుదాం అనే నినాదంతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. దీనిపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపికచేసి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులకు, తల్లిదండ్రులకు మొక్కలను పంపిణీ చేసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భద్ర, రామకృష్ణ, వెంకటరాఘవన్, మహేశ్, అమర్, నందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆసుపత్రిలో పాము కలకలం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రంగశాయిపేట పశువుల ఆసుపత్రిలో పాము కలకలం రేపింది. శనివారం ఆసుపత్రి భవనంలోని తలుపుచాటున నక్కిన పామును చూసి సిబ్బంది భయభ్రాంతులకు లోనయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ మాలతి అక్కడికి చేరుకొని పాములను పట్టేవారికి సమాచారం అందించారు. వెంటనే అక్కడి చేరుకొన్న పాములు పట్టే వ్యక్తి సర్పాన్ని అదుపులోకి తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన కట్టయ్య

కరీమాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడిగా కరీమాబాద్‌కు చెందిన బొమ్మల కట్టయ్య శనివారం బాధ్యతలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మైనార్టీ కమిషన్ సభ్యుడిగా కట్టయ్యను నియమించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ వెళ్లిన కట్టయ్య రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ ఖమ్రుద్దీన్‌ను కలిసి కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు తీసుకున్నారు.

ఎంజీఎం ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, రమేశ్

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఎంజీఎం మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర కాలమానిని శనివారం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ ఆవిష్కరించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా జనవర్ 26న ఉత్తమ అవార్డులు అందించాలని విజయ్‌భాస్కర్ సూపరింటెండెంట్‌ను కోరారు. స్నార్క్ సంస్థ చెల్లించాల్సిన నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదలయ్యేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ మల్లేశ్వర్, డాక్టర్ మోహన్‌రావు, అసోసియేషన్ అధ్యక్షుడు మహమూద్, కార్యదర్శి సతీశ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో...

ఎల్లంబజార్ (మట్టెవాడ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషిచేయాలని వరంగల్ మండల విద్యాధికారి వీరభద్రనాయక్ సూచించారు. మట్టెవాడలోని తన కార్యాలయంలో శనివారం టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అశోక్, మనోజ్, వెంకటేశ్వర్‌రావు, ఎల్లయ్య, యాకయ్య, దినేశ్, అశోక్ పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులను ఆదుకోవాలి

కొత్తవాడ, న్యూస్‌టుడే: మాజీ ప్రజాప్రతినిధులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచి, ఎంపీటీసీ, కౌన్సిలర్, కార్పొరేటర్ల యునైటెడ్ ఫోరం రాష్ట్ర నేతదార సుహాసిని అన్నారు. శనివారం కొత్తవాడలో అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన ఫోరం సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాసేవ చేసిన మాజీ ప్రజాప్రతినిధుల పరిస్థితులు ప్రస్తుతం దుర్భరంగా మారాయన్నారు. కొందరి పరిస్థితి అయితే దయనీయంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాజీ ప్రజాప్రతినిధులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సర్వేశం, రవి, భాస్కర్, లక్షణ్, మాజీ కౌన్సిలర్లు వీరస్వామి, పూర్ణప్రసాద్, చిన్నభద్రయ్య, మణిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీరస్వామి

మరుగుదొడ్డి ప్రారంభం

పీపీచమన్ (మట్టెవాడ), న్యూస్‌టుడే: వరంగల్ మహానగర పాలక సంస్థ 26వ డివిజన్ పరిధిలోని ఇస్లామియా ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డిని కార్పొరేటర్ గుండా ప్రకాశ్‌రావు శనివారం ప్రారంభించారు. పాఠశాల పాలకవర్గం ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో బాలబాలికలకు మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గం ప్రతినిధులు, డివిజన్ టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెరాస ముఖ్య కార్యకర్తల సమావేశం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రంగశాయిపేటలో తెరాస ముఖ్య కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. 7వ డివిజన్ కార్పొరేటర్ కేడల పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈనెల 13న భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. పీఏసీఎస్ ఛైర్మన్ కేడల జనార్దన్, నల్గొండ రమేష్, మాజీ మార్కెట్ ఛైర్మన్ టీ. రమేష్‌బాబు, ఎల్లగౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో భాజపా పతనం ఖాయం

- సీపీఐ జాతీయ నాయకుడు, కేరళ మాజీ మంత్రి బినయ్‌విశ్వం

కరీమాబాద్, న్యూస్‌టుడే: వచ్చే 2019 ఎన్నికల్లో కేంద్రంలోని భాజపా పతనం ఖాయమని సీపీఐ జాతీయ నాయకుడు, కేరళ రాష్ట్ర మాజీ మంత్రి బినయ్ విశ్వం జోస్యం చెప్పారు. శనివారం సాయంత్రం ఉర్సు గుట్టలో గంగసాని తిరుమల్‌రెడ్డినగర్ సీపీఐ శాఖ 3వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దుతో ఎంతో మంది ఇబ్బందులు పడ్డారన్నారు. నోట్ల రద్దు తప్పుడు నిర్ణయమన్నారు. జీఎస్టీ ఓ గిమ్మిక్కని చెప్పారు. దేశంలో వామపక్ష, లౌకిక శక్తుల వేదిక కోసం సీపీఐ ప్రయత్నిస్తోందన్నారు. కేరళలో నిర్వహించే సీపీఐ జాతీయ మహాసభలలో ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి. శ్రీనివాసరావు, సీపీఐ పార్టీ నగర సహాయ కార్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్, అర్బన్ జిల్లా కార్యదర్శి కరుణార్, నగర కార్యదర్శి బాష్‌మియా, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలివుల్లాఖాద్రీ, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.


సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న కేరళ మాజీ మంత్రి బినయ్‌విశ్వం

వరంగల్ పశ్చిమ

డైరీ ఆవిష్కరణకు తరలిన ఎస్సీ విద్యుత్ ఉద్యోగులు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణకు ఎన్పీడీసీఎల్‌లోని ఎస్సీ విద్యుత్ ఉద్యోగులు శనివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. హన్మకొండలోని ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలదండ వేసిన అనంతరం తరలివెళ్లారు.

నేడు పింఛనుదారుల సమావేశం

సుబేదారి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం సమావేశం ఆదివారం సుబేదారిలోని ఆవోపా భవన్‌లో ఉంటుందని అధ్యక్షుడు నరసింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆదాయం పన్ను తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. పింఛనుదారులందరూ హాజరుకావాలని కోరారు.

ఆలస్యం.. ప్రమాదకరం..!

● నత్తనడకన కాలువ పనులు
● ఆందోళన చెందుతున్న ప్రజలు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: అభివృద్ధి శరవేగంగా సాగుతుందంటే అందరూ సంతోషిస్తారు.. అదే అభివృద్ధి పేరిట చేపట్టిన పనులు ప్రాణ సంకటంగా మారి నరకం అనుభవిస్తున్నామని చెబుతున్నారు కాజీపేట బాపూజీనగర్ ప్రజలు. కాజీపేట బాపూజీనగర్ రహదారికి పక్కన చేపట్టిన కాలువ, రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పది ఫీట్ల వెడల్పు, పది హేను ఫీట్ల వెడల్పుతో ఇళ్ల ముందు కందకం తీశారు. తాగునీటి సరఫరా లైన్లు ఉన్నాయి కొద్దిగా నెమ్మదిగా తీయండని చెప్పినా వినని సిబ్బంది.. జేసీబీ యంత్రాలతో విచక్షణ రహితంగా కందకాలు చేపట్టారు. ఫలితంగా తాగునీటి సరఫరా జరిగే ప్రధాన లైన్లతోపాటు ఇళ్లలోకి వెళ్లే పైపులు అక్కరకు రాకుండా పగిలిపోయాయి. ఓ వారం రోజుల్లో పనులు పూర్తై మళ్లీ ఏదో ఒకటి చేసుకుందామని అనుకున్న ప్రజలకు అడియాశ ఎదురైంది. కందకం తీసిన గుత్తేదారు తన పని అయిపోయిందని కనిపించకుండా పోవడంతో ఇళ్ల ముందు లీకేజీ పైపు నీళ్లతో బావులను తలపించేలా కాలువలు మారాయి. ప్రజలంతా కంచెలు వేసుకొని ఇంట్లో నుంచి బయటకు కష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ఆసుపత్రికి తీసుకెళ్లలేని విధంగా మారింది. ఈక్రమంలో ప్రజలు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పని చేస్తున్నారు. గుత్తేదారు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారుల అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని 53వ డివిజన్ కార్పొరేటర్ లింగం మౌనికరెడ్డి స్థానికులకు సమాధానం చెబుతున్నారు. కందకాలు తీసి ఇప్పటికి 25 రోజులు దాటినా పనులు పురోగతి లేకుండా తమకు కష్టం కలిగిస్తున్నారని ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


బాపూజీనగర్‌లో ఇళ్ల ముందు నీరు నిలిచిన కాలువ

భయంగా బయటకు..

–నిష్కల, గృహిణి, బాపూజీనగర్



భయంగా ఇంట్లో నుంచి బయటకు రాకపోకలు సాగిస్తున్నాం. పది ఫీట్ల లోతులో నీళ్లు నిలిచాయని, ఇంకా నీటి సరఫరా జరిగినప్పుడు కుంటల తరహాలో పొంగి పొర్లుతున్నాయి. ఎక్కడ పిల్లలు పడిపోతారననే నిత్యం మానసిక వేదనకు గురవుతున్నాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని కనీసం సమాధానం చెప్పే నాథులు కూడా ఈ ప్రాంతంలో కనిపించడం లేదు. ఇష్టారాజ్యంగా తవ్వి వెళ్తే ఇక్కడ ఎవరి ప్రాణాలకైనా ఏమైన జరిగితే ఎవరు బాధ్యులు. అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకొని పనులు పూర్తి చేయాలి.

జారి కిందపడితే చేయి విరిగింది

–తానరస్ మార్వాడీ, బాపూజీనగర్



మా జ్యువెలరీకి వెళ్లి బయటకు వస్తుండగా జారి పడ్డాను. ఎడమ చేయి విరిగింది. ఇంకా కొంచెమైతే కాలువలో పడేవాణ్ని. అదృష్టం కొద్ది కాలువ గట్టుపై పడటంతో ప్రాణం దక్కి చేయి విరిగింది. ఇరవై రోజులు దాటినా పనులు చేయడం లేదు. ఎంతకాలం కష్టం అనుభవించాలి. రహదారి పక్కన పెట్టుకున్న వ్యాపార సముదాయల్లోకి ప్రజలు రాలేక వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అద్దెలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. నిలిపివేసిన పనులను వెంటనే చేపట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

బాలసముద్రం, న్యూస్‌టుడే : హన్మకొండ రాంనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు మాస సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మధుసూదన్, ఎం.రాఘవులు ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న హన్మకొండ నగర శాఖ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సభ్యులు సకాలంలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు ప్రకటనలో కోరారు.

నేడు సదస్సు

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ జన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు హంటర్‌రోడ్డులోని మాజీ మంత్రి పురుషోత్తమరావు నివాసంలో 'విద్యతో మహిళా చైతన్యం- సావిత్రిబా పూలే' అంశంపై కేయూ ప్రొఫెసర్ వి.శోభ కీలకోపన్యాసం చేస్తారని ఆ సంఘం జిల్లా కన్వీనర్ తక్కళ్లపల్లి రాము ప్రకటనలో తెలిపారు.

రేపు ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ మహాసభ

నయీంనగర్, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ సంక్షేమ సంఘం ప్రథమ మహాసభ భీమారం చింతగట్టు కాలువ సమీపంలోని కేఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి నాగపూరి రవీందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, నగర మేయర్ నన్నపునేని నరేందర్, రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకన్న, ప్రధాన కార్యదర్శి బి.బాలరాజు, ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

యాదవ పరపతి సంఘం కాలమానిని ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవ పరపతి సంఘం నేతలు

సోమిడిరోడ్, న్యూస్‌టుడే: సోమిడి యాదవ పరపతి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం సంఘం నేతలు స్థానిక రాధాకృష్ణ దేవాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జక్కుల రమాదేవియాదవ్ మాట్లాడుతూ.. యాదవులంతా సంఘటితంగా ఉండి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు నాగరాజుయాదవ్, పరుశరాం, బొయిని కుమార్‌యాదవ్, జక్కుల రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

బాలసముద్రం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఏఐఎంఈడీ పోటీ పరీక్షలో బాలసముద్రంలోని గురుకుల్ ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. 5వ తరగతి విద్యార్థులు బి.సహస్రరావు ద్వితీయ స్థానం, ఎన్.శ్రీరామ్ తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. శనివారం ర్యాంకులు పొందిన విద్యార్థులను పాఠశాల ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

బాలసముద్రం, న్యూస్‌టుడే : శ్రీనివాస్ రామానుజన్ గణిత పోటీ పరీక్షల్లో హన్మకొండ షైన్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. శనివారం విద్యార్థులు జె.సాయి చైతన్య, ఎండీ.సఫాన్ అరీద్, ఎస్.అక్షిత, బి.వర్తికారెడ్డి, పి.శ్రీనిధి, కేఎస్.ప్రమోద్ యాదవ్, సీహెచ్.అన్నుతేజ, పి.విశాల్‌ను పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

ఇనిస్టిట్యూట్ ముందు డబ్బుల వివాదం

కాజీపేట న్యూస్‌టుడే: కాజీపేట రైల్వే ఇనిస్టిట్యూట్ ముందు శనివారం రాత్రి స్వల్ప వివాదం నెలకొంది. డీఆర్ఎం ట్రోఫీ పేరుతో నిర్వహిస్తున్న క్రీడల్లో డబ్బులు ఎక్కువ వసూలు చేస్తున్నారని సుధాకర్ అనే ఉద్యోగి గొడవకు దిగారు. ఇనిస్టిట్యూట్ వర్గాలు ఆర్పీఎఫ్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు ఉద్యోగిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

21న 'పునర్జన్మ' సినిమా విడుదల

బాలసముద్రం, న్యూస్‌టుడే : పునర్జన్మ సినిమా ఈనెల 21న కాకతీయ వైద్య కళాశాల ఎన్ఆర్ఐ భవన్‌లో విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ డీఎల్.మూర్తి పేర్కొన్నారు. విడుదల కార్యక్రమం విజయవంతం చేయాలంటూ శనివారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. దివంగత డాక్టర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావుకు అంకితమిస్తూ సమాజంలో ఉన్న యువతీయువకులు అవయవదానం చేసి మానవత్వం చాటాలనే సందేశంతో సినిమా రూపొందించామన్నారు. వరంగల్‌కు చెందిన అల్లాపురం దామోదర్ నటుడిగా, ముంబయికి చెందిన ప్రాచీ సర్కార్ నటిగా అలరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బూర విద్యాసాగర్ గౌడ్, ఎన్ఎస్.నాయక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

సిద్ధార్థనగర్, న్యూస్‌టుడే: ఫాతిమానగర్‌లో సెయింట్ గ్రేబియల్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి చాయారతన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు తమ చదువులు సాగించాలని ఆమె సూచించారు. ఏపీ మాజీ డీజీపీ ఎం.రతన్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు ముందే పసిగట్టి ఆ దిశలో వారిని ప్రోత్సహించాలని అన్నారు. కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.తరుణ్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా సంయుక్త కలెక్టర్ అమయ్‌కుమార్‌లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైకో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కాకతీయ రెడ్ల శంఖారావం గోడపత్రిక ఆవిష్కరణ

జులైవాడ, న్యూస్‌టుడే: ఫిబ్రవరి 11న వరంగల్‌లో నిర్వహించే కాకతీయ రెడ్ల శంఖారావం బహిరంగ సభ గోడపత్రికను శనివారం ఉమ్మడి జిల్లా నాయకులు హన్మకొండలోని పోస్టల్‌కాలనీలో విడుదల చేశారు. స్థానిక అభయాంజనేయ స్వామి దేవాలయంలో నాయకులు ఈ గోడపత్రికకు పూజలు చేశారు. అనంతరం రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపు జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డిలకు చెందాల్సిన న్యాయమైన డిమాండ్ల సాధనకు చలో వరంగల్ పేరుతో ఫిబ్రవరి 11న కాకతీయ రెడ్ల శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి రెడ్డిలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక అర్బన్ జిల్లా అధ్యక్షుడు కుందూరు రమేష్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం రాష్ట్ర నాయకులు రావుల నరసింహారెడ్డి, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నల్ల రాజిరెడ్డి, జెహింద్‌రెడ్డి, గోవర్దన్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

వరంగల్ పశ్చిమ

ధూమపాన నిషేధ చట్టంపై అవగాహన

బాలసముద్రం: ధూమపాన నిషేధ చట్టం అమలుపై శనివారం హన్మకొండ చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు లా స్టూడెంట్స్ అసోసియేషన్ వి.కర్ణ ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపాన నిషేధ చట్టం ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉప్పుల రోజా, కల్వల కిషోర్, శ్రీనివాస్, వినయ్, యామిని తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం..!

భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మారావు



మాట్లాడుతున్న రావుపద్మ

నయీంనగర్, న్యూస్‌టుడే: 44వ డివిజన్‌లో భాజపా అభ్యర్థి కొలను సంతోష్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తున్నాడని, అది తెరాస ప్రభుత్వానికి హెచ్చరిక అని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్తినేని ధర్మరావు తెలిపారు. హన్మకొండ పోచమ్మకుంటలోని ఓ ప్రైవేట్ వేడుక మందిరంలో విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ భాజపా హత్య రాజకీయాలను ప్రోత్సహించే పార్టీ అనడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. తను స్వార్థంతోనే ఈ ఎన్నిక వచ్చిందనడం ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనడం సరికాదని తెలిపారు. కేవలం ఓడిపోతామనే భయంతోనే ఎమ్మెల్యే అలా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయలక్ష్మి, నరహరి వేణుగోపాల్ రెడ్డి, రఘోత్తంరెడ్డి, విజయ్, చంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రావుపద్మ ఆధ్వర్యంలో అభ్యర్థి సంతోష్‌రెడ్డి డివిజన్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దొంతుల వాసుదేవరెడ్డి, జిల్లా నాయకులు గాంద్రతి యాదగిరి, శనిగరం విజయ్, కురిమిళ్ల సదానందం, శివకుమార్ పాల్గొన్నారు.

భాజపాకి డిపాజిట్లు దక్కవు

ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

నయీంనగర్, న్యూస్‌టుడే: 44వ డివిజన్‌లో జరిగే ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి డిపాజిట్లు దక్కవని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. డివిజన్‌లో ఉప ఎన్నికను పురస్కరించుకొని శనివారం 5వ, 6వ బూత్‌లలో కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవిందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఏకగ్రీవానికి అన్ని పార్టీలు సహకరించినా భాజపా సహకరించలేదన్నారు. దాని ఫలితంగా ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భాజపా జిల్లా మహిళా అధ్యక్షురాలు తోటి మహిళకు సహకరించలేదని తెలిపారు. 9వ తేదీన జరిగే ఎన్నికలలో ప్రజలే వారికి గుణపాఠం చెబుతారని తెలిపారు. అనంతరం డివిజన్‌లోని పలు సంఘాలు తెరాస అభ్యర్థి సరితకు మద్దతు పలికాయి. అనంతరం తెరాస నాయకులు డివిజన్‌లో తిరిగి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెరాస అభ్యర్థి సరిత కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంస్థ ఛైర్మన్ వాసుదేవ రెడ్డి. తెరాస శ్రేణులు, కార్యకర్తలు ప్రజలు యువత పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ సామాజిక మాధ్యమం ఇన్‌ఛార్జిగా రహ్మతుల్లా

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ఎన్ఎస్‌యూఐ ముంబయి, కర్ణాటక రాష్ట్రాలకు సామాజిక మాధ్యమ ఇన్‌ఛార్జిగా కాజీపేటకు చెందిన మహ్మద్ రహ్మతుల్లా నియామకమయ్యారు. తనకు జాతీయ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాలను సామాజిక మాధ్యమం ద్వారా బలోపేతం చేయడానికి తనకు ఈ బాధ్యతలు అప్పజెప్పారని ప్రకటనలో తెలిపారు.

టీఎన్జీవోస్ ఖిలా వరంగల్ యూనిట్ కమిటీ ఎన్నిక

జులైవాడ, న్యూస్‌టుడే: టీఎన్జీవోస్ ఖిలా వరంగల్ శాఖ కమిటీని శనివారం కలెక్టరేట్‌లోని ఎన్జీవోస్ భవనంలో జిల్లా అధ్యక్షుడు కోల రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్వీ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సదయ్య, కార్యదర్శిగా భాస్కర్, సంయుక్త కార్యదర్శిగా గడ్డం రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్యాంకుమార్, కోశాధికారిగా శ్రీధర్‌గౌడ్, ప్రచార కార్యదర్శిగా మహేందర్, కార్యవర్గ సభ్యులుగా దీపక్, స్వర్ణలతలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేష్‌కుమార్, కార్యదర్శి రత్నవీరాచారిలు వారికి నియామకపత్రాలు అందజేశారు.

మానవీయ విలువలతో సులక్ష్య సేవలు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: మానవీయ విలువలను బతికించేవిధంగా సులక్ష్య సేవా సమితి వృద్ధులు, అనాథలకు సేవలు అందిస్తుందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గిరిజామనోహర్‌బాబు అన్నారు. సులక్ష్య సమితి వ్యవస్థాపకుడు మండువసంతోష్ ఆధ్వర్యంలో శనివారం వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాహితీవేత్త గిరిజామనోహర్‌బాబు మాట్లాడుతూ.. మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరు మరో మనిషికి సహాయం చేయవలసిన బాధ్యత ఉందన్నారు. అనంతరం హంటర్‌రోడ్‌లోని ఏకశిల అనాథాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సులక్ష్య నాయకులు రంజిత్, విక్రమ్, ఆకాష్, వినయ్, కార్తీక్, ఆశ్రమ వ్యవస్థాపకుడు ఒద్దిరాజుచంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు రాయితీ రుణాలు అందించాలి

బాలసముద్రం, న్యూస్‌టుడే : విశ్వబ్రాహ్మణులకు రాయితీ రుణాలు అందించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సంఘాల అభివృద్ధి సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తొవిటి సదానందచారి డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఇనుము, కర్ర, శిల్పి, ఇత్తడి, బంగారం తదితర కుల చేతి వృత్తుల పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దరఖాస్తు చేసుకున్న సంఘాలకు బ్యాంకు లింకేజీ లేకుండా రాయితీ అందించాలన్నారు. సమావేశంలో సమాఖ్య నాయకులు అనంతోజు వెంకటాచారి, కందుకూరి వనజ, అన్నాజి రమ్య, అన్నాజీ శారద, కందుకూరి శ్రీనివాస్, మాటూరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాకు శ్వేతాబాయి పేరు పెట్టాలి



నివాళులర్పిస్తున్న నేతలు

బాలసముద్రం, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లాకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్న ధరావత్ శ్వేతాబాయి పేరు పెట్టాలని బంజారా రచయిత సంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ జాటోత్ రాజారాం, లంబాడీ ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ భానోత్ నవీన్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం హన్మకొండ అదాలత్ కూడలిలోని అమర వీరుల స్థూపం వద్ద శ్వేతాబాయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక, ఇతర సంఘాల నేతలు భానునాయక్, మహేందర్ నాయక్, రతన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఏజెండాపై ఎన్నికలు జరగాలి



మాట్లాడుతున్న వెంకటనారాయణ

బాలసముద్రం, న్యూస్‌టుడే : 44వ డివిజన్‌లో అభివృద్ధి ఏజెండాపై ఎన్నికలు జరగాలని పౌర సంఘాల ఐకాస గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పేర్కొన్నారు. శనివారం బాలసముద్రంలోని ఆయన నివాసంలో ఐకాస ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. డబ్బు, మద్యం పంచుతూ ఓటర్లను ప్రలోభ పెట్టవద్దన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం పంచుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు. నీతివంతమైన రాజకీయ పునాది వేసే విధంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఐకాస కన్వీనర్ డాక్టర్ తిరునహరి శేష మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ బూత్‌లో వంద మంది ఓటర్లకు ఒక కార్యకర్తను నియమించి డబ్బులు పంచాలని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఐకాస ఛైర్మన్ పుల్లూరు సుధాకర్ మాట్లాడారు. ఐకాస నేతలు పాలడుగుల సురేందర్, జి.యాదగిరి, ఎస్.వీరభద్రుడు, బండారి జనార్దన్‌గౌడ్, కల్లూరి పవన్, దామెరుప్పల సతీష్, శ్రీకాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శిగా పద్మ



గోపాలపూర్, న్యూస్‌టుడే : వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా వలిపిరెడ్డి పద్మ ఎన్నికయ్యారు. హన్మకొండకు చెందిన పద్మ వరంగల్ రూరల్‌జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్నారు. శనివారం హన్మకొండలో జరిగిన జిల్లా కార్యవర్గంలో పద్మను సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆమె స్వీయ ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ వరంగల్ సిటీ యూనిట్ అధ్యక్షుడిగా సురేష్



వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే : టీఎన్జీవోస్ వరంగల్ సిటి యూనిట్ అధ్యక్షుడిగా పశు సంవర్ధకశాఖ ఉద్యోగుల సంఘం నేతగా పని చేస్తున్న బింగి సురేష్ ఎన్నికయ్యారు. ఈ సంఘాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోల రాజేష్‌కుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శిగా బి.కీర్తికుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా రమేష్‌లు ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నేతలకు బింగి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

సురేష్‌కు రాష్ట్ర స్థాయి పూలే అవార్డు

గోపాలపూర్, న్యూస్‌టుడే : సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనాథలు, వృద్ధులు, వికలాంగులకు సేవలందిస్తున్న రాపర్తి సురేష్‌యాదవ్‌కు రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు లభించింది. హన్మకొండకు చెందిన సురేష్ టీబీ ఆసుపత్రిలో ఎయిడ్స్ విభాగంలో కౌన్సిలర్‌గా పని చేస్తున్నారు. ప్రధానంగా రాపర్తి సురేష్ రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాల నిర్వహిస్తూ పేద వారికి వైద్య సేవలను అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు. సామాజిక సేవ చేస్తున్నందుకు సావిత్రిబాయి పూలే సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర స్థాయి పూలే అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. ఈ అవార్డును సురేష్‌కు సావిత్రిబాయి పూలే సాంఘిక సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మేపురి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి ఎండీ యాకూబ్ పాషా, రాష్ట్ర అధ్యక్షుడు జంపాల కృష్ణమూర్తి నుంచి అందుకున్నట్లు స్వీయ ప్రకటనలో తెలిపారు.



అవార్డును అందుకుంటున్న సురేష్

దుప్పట్ల పంపిణీ

జులైవాడ, న్యూస్‌టుడే: 37వ డివిజన్ ప్రగతినగర్ మురికివాడల్లోని పేదలకు సహృదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు యాకూబ్బీ శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కొంతమంది దాతలను సంప్రదించి వారి ద్వారా ఈ దుప్పట్లను తెప్పించి పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్ సత్తార్, షేక్ తాజొద్దీన్, ప్రమీల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

వృద్ధాశ్రమానికి సహాయం



సరకులు అందజేస్తున్న ప్రతినిధులు

డీజిల్‌కాలనీ, న్యూస్‌టుడే: డీజిల్ కాలనీ బాలాజీనగర్‌లోని అమ్మ వృద్ధాశ్రమానికి సుప్రియ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం నిత్యావసర సరకులు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వృద్ధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అంత్యదశలో వారికి అండగా ఉండి భరోసా కల్పించాలని సూచించారు. ఆశ్రమ నిర్వాహకురాలు శ్రీదేవికి వారు హామీ ఇచ్చారు.

EENADU THE ఈ WAY CLASSIFIEDS

BIRTHDAY GREETINGS



AUTOMOTIVE

ఖమ్మం, సత్యం ఇంజనీరింగ్ కంపెనీ నందు ఫ్లైయాష్ బ్రిక్స్ కొరకు పాన్ మిక్సర్, హైడ్రాలిక్ మిషన్స్ మరియు ఇటుకలు కొరకు సంప్ర॥ 9000064433, 9000074433

VEHICLES FOR SALE

TATA MARCOPOLO 42 Seaters School Buses 2010- 6,25,000/-. 2012- 8,75,000/-. 2013- 9,75,000/-. 2014- 11,00,000/-, 2015- Eicher Skyline 12,50,000/-. 75% Finance. ✆ 95333 31111.

1) Tata Indica CR4eV2 Good Condition, 2014 Model, White Colour, 2) Eicher Jumbo 20.16, Good & Excellent Condition are for Sale. Interest Person Can Send their Offer to prabirbanik@sugunafoods.co.in Ph: 7680901127, 040-30923000

Green Honda Offering Exchange cars for Sale @ Reasonable Price, Honda City 2015 Reading 33490 And Honda Demo Cars also available for Sale. Cont: 7799914027

BUSINESS SERVICES

గ్యాస్ సేఫ్టీ డివైజ్ హోల్‌సేల్ ధరలకే అమ్మబడును. 1699/- రూ. మాత్రమే. మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా ఏజెంట్లు కావలెను. సెల్: 63000 60523.

WANTED DEALERS/AGENTS

Distributors Wanted for Patanjali Products. Respond with Valid Drug License to chak.gadde@otify.in ✆ 040-33462433/ 9294005679.

Wanted Distributors: ప్రముఖ కూల్‌డ్రింక్స్ పంపిణీ చేయుటకు పట్టణముల వారీగా/ ఏరియాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. ✆ 8125787353/ 9849777717.

BUSINESS OFFER

Lotusfast Pvt. Ltd. is recruiting Dist. Franchisees to deliver online E-Commerce Products. Interested candidate can contact us. www.lotusfast.store (or) 90300 03900 & Hyd. Region Z.M. Rajesh. 75695 89469.

